క్లుప్తంగా

హెల్మెట్ ధారణ తప్పనిసరి


ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ సుబ్బరాజు

వీరవాసరం: ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అడిషనల్ ఎస్పీ ఎ.సుబ్బరాజు సూచించారు. నౌడూరు జంక్షన్‌లో సోమవారం వాహనచోదలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనచోదకుడు విధిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. తోటి వాహనచోదకులకు, ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా వాహనాన్ని నడపాలన్నారు. హెల్మెట్ వాడకం వల్ల ప్రమాదాల్లో ప్రాణనష్టం సంభవించకుండా రక్షణ కల్పించుకోవచ్చని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీరవాసరం ఎస్సై పి.రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు పండ్ల పంపిణీ


కలసిపూడిలో వృద్ధులకు పండ్లు అందిస్తున్న దృశ్యం

ఉండి: పెద్దలను ఆదర్శంగా తీసుకుని సేవాకార్యక్రమాలను నిర్వహించాలని ఎస్సై కే గంగాధరరావు అన్నారు. సోమవారం కలిసిపూడిలో రిటైర్డ్ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి కేశబోయిన కృష్ణమూర్తి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శివప్రసాద్ ఆర్థిక సహకారంతో వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు కానుబోయిన వెంకటసత్యనారాయణ ఆధ్వర్యంలో వృద్ధులు, పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఎస్సై మాట్లాడుతూ యువత సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. బోయిన శ్రీను, బాతు మోషేష్‌రాజు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ ముఖద్వారం వద్ద లైట్ల ఏర్పాటుకు వినతి

ఉండి: ఉండి రైల్వేస్టేషన్ ముఖద్వారంలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని ఉండి రైల్వే ప్రయాణికుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మన నాగబాబు, సీహెచ్ బంగార్రావు ఉన్నతాధికారులను కోరినట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాత్రి వేళల్లో రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు, రైలు దిగిన బయటకు వచ్చిన ప్రయాణికులు స్టేషన్ ముఖద్వారంలో చీకటి కారణంగా చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యపై విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్‌కు ప్రయాణికుల సంఘం తరపున వినతిపత్రాన్ని పంపించామని తెలిపారు. రైల్వే అధికారులు ప్రయాణికుల వినతిని పరిగణనలోకి తీసుకుని స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

సంఘ గౌరవాధ్యక్షులుగా మహంకాళి నియామకం


మహంకాళి

ఆకివీడు: ఉమ్మడి జిల్లా రజక సంఘం గౌరావాధ్యక్షులుగా భీమవరపు మహంకాళిని నియమించినట్లు రజక సంఘ జిల్లా అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య చెప్పారు. సోమవారం ఆకివీడు వచ్చిన ఆయన నియామకపత్రాన్ని అందజేస్తూ విలేకర్లతో మాట్లాడారు. మహంకాళి ఆకివీడు మండల రజక సంఘం అధ్యక్షులుగా కొనసాగుతున్నారని చెప్పారు. గత కొన్నేళ్లుగా రజకుల సమస్యలపై పోరాటాలు చేస్తూ పరిష్కారానికి మార్గాలు చూపుతూ మహంకాళి సంఘంలో చురుకైన పాత్ర పోషించారన్నారు. స్థానిక రజకులు పాల్గొన్నారు.

నేడు నగర పంచాయతీ సమావేశం

ఆకివీడు: ఆకివీడు నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ జామి హైమావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అజెండాలోని అంశాలపై సమావేశంలో చర్చిస్తామని, సమావేశానికి కౌన్సిలర్లు హాజరు కావాలని కోరారు.

జూదరుల అరెస్టు

పాలకోడేరు: మోగల్లులో పేకాట శిబిరంపై సోమవారం దాడి చేసి 12 మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు చెప్పారు. నిందితుల నుంచి రూ.4,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

మొగల్తూరు: నరసాపురం – మొగల్తూరు హైవేపై సోమవారం సీతారాంపురం వద్ద ట్రాక్టర్‌ను కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న వ్యక్తి సురక్షితంగా బయటపడటంతో పెనుప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం జాతీయ రహదారిపై సీతారాంపురం నుంచి నరసాపురం వైపు వెలుతున్న గడ్డి ట్రాక్టర్‌ను వెనుక నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొనడంతో కారు ముందు భాగం నుజునుజ్జు అయింది. ప్రమాదం సమయంలో కారులో ఉన్న బెలూన్లు తెరుచుకోవడంతో కారును నడుపుతున్న వ్యక్తి క్షేమంగా బయటపడ్డాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్సై ఎం వీరబాబు తెలిపారు.

అండర్ టన్నెల్స్ నిర్మాణానికి సహకరించండి

ఎంపీలు పి.మిథున్‌రెడ్డి, కోటగిరి శ్రీధర్‌లకు ఎమ్మెల్యే గ్రంధి వినతి


భీమవరంలో ఎంపీ మిథున్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించడానికి వివిధ ప్రాంతాల్లో రైల్వే అండర్ టన్నెల్స్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ రాజంపేట పార్లమెంట్ సభ్యుడు, వైఎస్సార్ సీపీ జిల్లా రీజనల్ కో–ఆర్డినేటర్ పి.మిథున్‌రెడ్డి, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌లను కోరారు. సోమవారం భీమవరంలో ఒక కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన ఎంపీలు ముందుగా ఎమ్మెల్యే శ్రీనివాస్ నివాసానికి చేరుకోగా, వారికి ఎమ్మెల్యే సాదర స్వాగతం పలికారు. అనంతరం నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వారికి వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో జనాభా పెరగడంతోపాటు జిల్లా కేంద్రంగా అవతరించడంతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమైందన్నారు. దీనికి అనుగుణంగా రోడ్ల విస్తరణ, రైల్వే గేట్ల వద్ద అండర్‌టన్నెల్స్ నిర్మించాల్సి ఉందన్నారు. దీనిలో భాగంగా నరసింహపురం రైల్వే గేట్,, బైపాస్ రోడ్ రైల్వే గేట్, ఉండి రైల్వే గేట్ వద్ద అండర్ టన్నెల్స్ నిర్మిస్తే ట్రాఫిక్ సమస్య చాలా వరకు పరిష్కారం అవుతుందని వివరించారు. ఇప్పటికే ఐదు ప్రాంతాల్లో రైల్వే అండర్ టన్నెల్స్ నిర్మించడం వల్ల కొంత వరకు ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించిందని, మిగిలిన చోట్ల కూడా అండర్ టన్నెల్స్ నిర్మిస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుందని మిథున్‌రెడ్డి, శ్రీధర్‌లకు వివరించి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జక్కంపూడి గణేష్, ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహారాజు, జెడ్పీటీసీ సభ్యులు కాండ్రేగుల నర్సింహారావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, నల్లం రాంబాబు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం కావాలి


గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సేవలందించాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో జేసీఎస్ కన్వీనర్లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కన్వీనర్లు వార్డుల వారీగా పార్టీ శ్రేణులతో కలిసి తెలుసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో ఇప్పటివరకు 98 శాతానికి పైగా అమలు చేశారన్నారు. ప్రతి కుటుంబం కూడా ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో నవరత్న పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అర్హులై ఉండి ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే వాటికి కారణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అన్నారు. పట్టణంలో అభివృద్ధి పనులను పెద్ద ఎత్తున చేయడం జరిగిందని, మిగిలిన పనులను కూడా చేపట్టడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా భీమవరం జిల్లా కేంద్రం కావడంతో పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పనితీరును, అదే మాదిరిగా పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజల వద్దకు వెళ్లి తెలియజేయాలన్నారు. పట్టణంలో మొత్తం 39 వార్డులు ఉండగా, ప్రణాళికబద్ధంగా ప్రతి వార్డును కూడా అభివృద్ధి చేస్తున్నామని, ఈ విషయాన్ని ప్రజలకు పూర్తిస్థాయిలో తెలియజేసే విధంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని అన్నారు. గత మూడున్నర ఏళ్లుగా పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. పట్టణ అభివృద్ధి కోసం నూతనంగా మాస్టర్ ప్లాన్‌ను కూడా సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు అభివృద్ధి పరంగా ఇంకా ఎక్కడైనా సమస్యలు ఎదుర్కొంటుంటే వాటిని తెలుసుకుని తన దృష్టికి తీసుకురావాలని కన్వీనర్లకు సూచించారు. ఈ సమావేశంలో వన్‌టౌన్ కన్వీనర్ నల్లం రాంబాబు, టూ టౌన్ కన్వీనర్ గాదిరాజు సుబ్రహ్మణ్యంరాజు (తాతరాజు), త్రీటౌన్ కన్వీనర్ చెల్లబోయిన సూర్యప్రకాశరావు, తోట భోగయ్య పాల్గొన్నారు.

స్పందనలో ఐదు ఫిర్యాదులు

ఆకివీడు: స్పందన కార్యక్రమంలో ఐదు ఫిర్యాదులు వచ్చినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్ఎస్ శ్రీకర్ సోమవారం చెప్పారు. కోళ్లపర్రులోని నావలకోడు పంట కాలువను ఆనుకుని చెరువుగట్టు వేయడంతో ఆ ప్రాంతం నుంచి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని ఆ ప్రాంత రైతులు శీర్ల వెంకటేశ్వరరావు, పాశం హైమావతి, కేశిరెడ్డి పరశురామయ్య ఫిర్యాదు చేశారు. దుంపగడపలోని మంచి నీటి కాల్వకు చేర్చి రొయ్యల చెరువు సాగు చేస్తున్నారని, నిబంధనలు అతిక్రమించి చెరువు తవ్వారని ఏడాదిగా ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడంలేదని రైతులు అద్దేపల్లి ప్రభాకరరావు, ఆదినారాయణ, సూరంపూడి వెంకట రాంబాబు ఫిర్యాదు చేశారు. తరటావలోని దస్తావేజు దాఖలా భూమిని సర్వే చేసి, సర్వే రిపోర్టు ఇవ్వాలని కోరినా పట్టించుకోవడంలేదని మల్లారెడ్డి వెంకట రామారావు ఫిర్యాదు చేశారు. స్థానిక చేపల మార్కెట్‌లో ఆశీల ధరలు తగ్గించాలని కోరుతూ చేపల వర్తక సంఘం, చేపల, రొయ్యల రైతులు అర్జీ అందించారు. కుప్పనపూడిలో తన భూమిని సర్వే చేయించాలని అత్మూరి గంగారావు అర్జీలో కోరారు. ఆయా సమస్యలను అధికారులకు పంపినట్లు శ్రీకర్ చెప్పారు.

సర్రాజు ఆశయాలు నెరవేరుద్దాం


సరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ మండల నాయకులు

ఉండి: క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు ఆశయాలను నెరవేర్చి ఉండి అసెంబ్లీ స్థానాన్ని వైఎస్సార్ సీపీ దక్కించుకునేలా చేద్దామని ఉండి మండల వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. సోమవారం సర్రాజు దశదినకర్మ కార్యక్రమంలో భాగంగా పలువురు నాయకులు సర్రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాల్లో సర్రాజు వంటి భోళాశంకరుడు ఎవ్వరూ లేరని అన్నారు. ఆప్యాయత, ప్రేమ, ఎవ్వరితోనైనా కలుపుగోలుగా మాట్లాడటం ఆయనకు మాత్రమే సొంతమన్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరినీ గౌరవంగా మాట్లాడేవారని, అందుకే ఈ రోజు ఇంత గొప్పగా పార్టీలకు అతీతంగా సర్రాజుకు నివాళులర్పిస్తున్నారన్నారు. ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరాలని సర్రాజు ఎప్పుడు అంటుండేవారని మనమంతా ఆయన ఆశయాలు సాధిస్తూ ఉండి స్థానాన్ని గెలిచి సర్రాజుకు నిజమైన నివాళి అర్పిద్దామని ప్రతిజ్ఞ చేశారు. రాజకీయాల్లో సర్రాజు వంటి వ్యక్తి అరుదుగా కనిపిస్తారని, ఆయన మరణం వైఎస్సార్‌సీపీకి తీరనిలోటని అన్నారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు సోదరుడు పీ.గోపాలకృష్ణంరాజు, జెడ్పీటీసీ సభ్యులు రణస్తుల కనకదుర్గ, రణస్తుల మహంకాళి, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు (హరిబాబు), మండల పార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, రాష్ట్ర డైరెక్టర్లు గులిపల్లి అచ్చారావు, కొవ్వపాటి అనిత, పార్టీ రాష్ట్ర, జిల్లా వైఎస్సార్‌సీపీ నాయకులు కరిమెరక చంద్రరావు, యేడిద వెంకటేశ్వరరావు, జీ.సుందర్‌కుమార్, గలావిల్లి ధనుంజయ, గుండాబత్తుల సుబ్బారావు, బడుగు బాలాజీ, కమతం బెనర్జీ, గొట్టుముక్కల కళ్యాణ్ వర్మ, అల్లూరి వెంకట్రాజు, అంగర రాంబాబు, ఆయా గ్రామాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ శాస్త్రవేత్తగా ఎదగాలి


ఆకివీడు హైస్కూల్‌లో విజ్ఞానదాయక ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు


విద్యార్థిని వేసిన శాస్త్రవేత్త బొమ్మ ముగ్గు

ఆకివీడు: ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలని, అప్పుడే మన దేశం అగ్రరాజ్యంగా వెలుగొందుతుందని స్థానిక పీఎల్ఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీ.విజయభాస్కర్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణలో వినూత్న రీతిలో విద్యార్థినులరకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. భౌతికశాస్త్రంలో కిరణ రేఖా చిత్రాలు, అంతరిక్ష యాత్ర చేస్తున్న వ్యోమగామి, నోబుల్ బహుమతి గ్రహీత సర్ సీవీ రామన్ చిత్రాలు, జీవశాస్త్రంలో శిషు జననం, మానవుని జీర్ణ వ్యవస్థ, రక్త ప్రసరణ, రసాయన శాస్త్రంలో ఆర్బిటాల్స్ మూలకాల ఆవర్తన పట్టిక, మోయిలర్ చార్ట్‌లతో పాటు పలు ఆసక్తికర సైన్సు చిత్రాల్ని ముగ్గులతో వేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ భవిష్యత్ తరానికి ఉపయోగపడే పలు ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. సైన్సు దినోత్సవాలు, సైన్స్ పేయిర్‌లు, సదస్సులు నూతన ఆవిష్కరణలకు వేదికలుగా ఉన్నాయని చెప్పారు. సైన్సు ఉపాధ్యాయులు క్రిష్ లతా గ్లోరీ, యానీ రత్న కుమారి, నాగరాజు, ఏడుకొండలు, ప్రసాద్, కవిత, పార్వతి, రమేష్ ఉన్నారు.

‘మధ్యాహ్న భోజనం’లో నిర్లక్ష్యంగా ఉండొద్దు


విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఎండీఎం కో–ఆర్డినేటర్ కృష్ణారావు

కాళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న గోరుముద్ద (మధ్యాహ్న భోజన పథకం) నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎండీఎం కో–ఆర్డినేటర్ కృష్ణారావు అన్నారు. కోపల్లె, వేంపాడు ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం పథకానికి ఉపయోగించే వంటనూనె, కూరగాయలు, చిక్కీలు, వంటి ఇతర పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ద్వారా వచ్చే తాగునీరు, విద్యార్థులు ఉపయోగించే టాయిలెట్స్, పారిశుద్ధ్య నిర్వహణ, రికార్డులను తనిఖీ చేసి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సరైన విద్య అందాలంటే నాణ్యమైన పోషకాహారం అవసరమన్నారు. పోషక విలువలు కూడిన ఆహారంతో పాటు గుడ్లు, చిక్కీలు, పోర్టిఫైడ్ బియ్యం ప్రభుత్వం అందిస్తోందన్నారు. మెనూ ప్రకారం పిల్లలకు రుచికరంగా వండి వడ్డించాలని సూచించారు. హెచ్ఎం సుభాషిణి, శివమాధవి, సీఆర్పీ పుష్పరాజ్, పాల్గొన్నారు.

రైతు మేలు కోసమే జగనన్న భూహక్కు


కొమరాడలో రీసర్వేను డ్రోన్ సహాయంతో ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: భూవివాదాలు లేకుండా శాశ్వతంగా భూహక్కు పత్రాలను రైతులకు అందజేసి వారికి మేలు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకాన్ని ప్రవేశపెట్టారని డ్రోన్ సర్వే డీటీ ఎస్ఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. భీమవరం మండలంలోని కొమరాడ గ్రామంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకంలో భాగంగా సోమవారం డ్రోన్ సహాయంతో భూములు రీసర్వే చేసే కార్యక్రమాన్ని ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నరసింహాపురం, తుందుర్రు, బేతపూడి, కొమరాడ గ్రామాలలో రీసర్వే పూర్తి చేయడం జరిగిందన్నారు. రైతులు ఎక్కువగా తమ పొలాల వద్ద సర్వే నంబర్లు తెలియక, రికార్డుల్లో భూవివరాలు ఒకలాగా, క్షేత్రస్థాయిలో భూమి విస్తీర్ణం తక్కువ ఎక్కువలు ఉండటంతో సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి రోవర్ పరికరాల ద్వారా కచ్చితత్వంతో సర్వే చేసి రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలను ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఇటువంటి కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ రాట్నాల రామకృష్ణస్వామి మాట్లాడుతూ భూరీసర్వేకు రైతులంతా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్లు ఎస్.రామాబాయి, జి.నాగబాబు, వీఆర్వో జి.పెంటయ్య, గ్రామ సర్వేయర్ వి.యుగంధర్, కార్యదర్శి పార్వతీ, రైతులు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



భీమవరం లూథరన్ హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

సాక్షి, భీమవరం: పట్టణంలోని లూథరన్ హైస్కూల్ 1987–1992 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం స్కూల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. సుమారు 30 ఏళ్ల తరువాత కుటుంబసభ్యులతో కలుసుక్ను వీరంతా ఎంతో ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులను సత్కరించడమేగాక స్కూల్‌కు అవసరమైన ఫర్నిచర్ కొనుగోలుకు కొంతమొత్తాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రస్తుత హెచ్ఎం మణిరాజు తదితరులు పాల్గొనగా రవి, రామకృష్ణ, కిషోర్, శేఖర్, సురేష్, షమీము, రాజా రంజన్, రాము, శ్రీను, చంద్రరావు, కరుణ, రాజు, రాజేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మంచు కురిసే వేళలో..



పాలకోడేరు, మోగల్లు గ్రామాల్లో అలుముకున్న మంచు

పాలకోడేరు: ఫిబ్రవరి నెలాఖరులోనూ ఉషోదయం వేళలో మంచు కురుస్తూ ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో ఉదయం 9 గంటలు దాటినా మంచు దట్టంగా అలుముకుని ఉంటోంది. సోమవారం పాలకోడేరు, మోగల్లు, శృంగవృక్షం, పెన్నాడ, వేండ్ర తదితర గ్రామాల్లో ఈ దృశ్యాలు చూపరులకు కనువిందు చేశాయి.


వేండ్రలో దట్టంగా కమ్మిన మంచు

రామాలయం పునఃప్రతిష్ఠాపన ప్రారంభం


గజల్ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ, సబ్ కలెక్టర్ తదితరులు

నరసాపురం: స్థానిక కుమ్మరివీధి ప్రసిద్ధ కోదండ రామాలయం పునప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఎస్ఆర్‌బి కొవ్వలి యతిరాజ రామ్మోహన్‌నాయుడు, శిరీష దంపతులతో పెద్దింటి అనిల్‌కుమార్ సిద్ధాంతి ఆచార్యుల ఆధ్వర్యంలో ఉదయం గోవు మంగళ వాయిద్యాలతో వేద మంత్ర సహిత గ్రామ ప్రదిక్షణ చేశారు. అఖండ దీపారాధన, ఖల్మషహోమం తదితర పూజలు నిర్వహించారు. రాత్రి గజల్ శ్రీనివాస్ గజల్స్ అలరించాయి. సీనీ గేయ రచయిత చేగొండి అనంత శ్రీరామ్ రామగేయ గానాన్ని అలపించారు. గజల్ శ్రీనివాస్, అనంత శ్రీరామ్‌లను ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. విశిష్ట అతిథిగా సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు చేగొండి రామకృష్ణ జమిందార్, పాలంకి వరప్రసాద్, కోటిపల్లి నందరావు, నంద్యాల బాబు, అధికారి సతీష్, గుడివాబ ప్రభాకర్ పాల్గొన్నారు.

నేడు పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం

భీమవరం(ప్రకాశం చౌక్): మెంటేవారి తోటలోని సుందరయ్య భవనంలో మంగళవారం సాయంత్రం పిల్లల హృదయ సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం కన్వీనర్ వి.రాధాకృష్ణ, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) పిల్లలను పరీక్షించి అవసరమైన వారికి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 15 సంవత్సరాల లోపు వయసు గల చిన్నారులకు మెడికల్ క్యాంపులో ఉచిత పరీక్షలు, వైద్య సేవలు అందిస్తారన్నారు. వైద్య శిబిరానికి వచ్చేవారు 62812 25145 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని వారు కోరారు.

లైఫ్ సర్టిఫికెట్ల సమర్పణకు నేడే తుది గడువు

ఉండి: పింఛను పొందుతున్న రిటైర్డ్ ఉద్యోగులు మంగళవారం లోగా లైఫ్ సర్టిఫికెట్‌లను సంబంధిత ట్రెజరీ ఆఫీసుల్లో అందజేయాలని రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘ ఉండి, ఆకివీడు శాఖ ఉపాధ్యక్షుడు గాదిరాజు రంగరాజు సోమవారం తెలిపారు. ప్రతి ఏటా జనవరి, ఫిబ్రవరి మాసాల్లో పింఛన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్ అందించాల్సి ఉంటుందన్నారు. మంగళవారం ఆఖరు రోజు అని, ఇందు కోసం గడువు పెంచే అవకాశం లేదని, సర్టిఫికెట్ అందించాలని సూచించారు. లేకపోతే పింఛన్ నిలిచిపోయే అవకాశం ఉందన్నారు. లైఫ్‌సర్టిఫికెట్ ఇచ్చేందుకు స్థానిక పోస్టుమేన్లు కూడా సహరిస్తారని, లైఫ్ సర్టిఫికెట్‌ను రాష్ట్రంలో ఎక్కడినుంచైనా ఇవ్వవచ్చని పేర్కొన్నారు.

ఉగాది సేవా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం(ప్రకాశం చౌక్): ఉగాది సేవా పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి చెప్పారు. సోమవారం స్థానిక కిరాణా మర్చంట్ అసోసియేషన్ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీవిజ్ఞాన వేదిక అధ్వర్యంలో గత 32 ఏళ్లుగా పట్టణంలో ఉగాది వేడుకల్లో వివిధ రంగాల్లో సేవాతత్పరులకు ఉగాది పురస్కారాలు అందిస్తున్నామన్నారు. జాతి, కుల, మత, పేద, ధనిక బేధం లేకుండా పురస్కారాలు అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేట్ రంగాలలో విద్యా, వైజ్ఞానిక, కళా, సామాజిక, క్రీడ, కార్మిక వ్యవసాయ రంగాల వారికి అవార్డులు అందిస్తున్నామని తెలిపారు. మార్చి 9వ తేదీ లోగా దరఖాస్తులు పంపాలని కోరారు. మరిన్ని వివరాలకు 88162 36063 నంబర్‌లో సంప్రదించాలన్నారు. చెరుకువాడ వెంకట్రామయ్య, లైబ్రేరియన్ కే శిరీష పాల్గొన్నారు.

రైతుల నిరసన

కాళ్ల: పొలాలకు సాగునీరు అందించాలంటూ వరి దుబ్బులతో రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పలువురు రైతులు మాట్లాడుతూ కాళ్లలో కె.లంక చానల్ పంట కాలువను ఆనుకుని సుమారు 700 ఎకరాల ఆయకట్టుకు 15 రోజులుగా కాలువ ద్వారా సాగునీరు పూర్తిస్థాయిలో అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకే ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కృష్ణారావుకు వినతిపత్రం అందించారు.